
సాక్షి
గుంటూరు
గురువారం, 26, సెప్టెంబర్, 2024



45.562 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 35,643 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 45.562 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 4,012 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 470 క్యూసెక్కులు వదిలారు.



విద్యార్థులకు కంటి పరీక్షలు

రొంపిచర్ల: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రొంపిచర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 355 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

30 వరకు ఈ-కేవైసీ గడువు పెంపు

కొరిటెపాడు(గుంటూరు): రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో భాగంగా ఈ-కేవైసీ చేయించుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గుంటూరు జిల్లాలో 1,87,284 ఎకరాల్లో ఈ-కేవైసీ పూర్తి చేశామన్నారు. మరో 27,168 ఎకరాలకు రైతులు చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. వంద శాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో నిత్యాన్నదానానికి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కొడాలి ప్రతాప్ కుమార్, సంధ్యారాణి దంపతులు వారి కుమారుడు షణ్ముఖ గణేష్ పేరిట రూ.లక్ష విరాళం ఇచ్చారు. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ ఏసీ శ్రీరామ వరప్రసాద రావుకు ఈ మొత్తాన్ని అందించారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో అధికారులు సత్కరించారు. ఆలయ అధికారి బర్మా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గుంటూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ (డీసీ)గా కె.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌వీవీఎస్ బాబ్జీ రావును విజయనగరం డీసీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరుకు సెబ్ హెడ్ క్వార్టర్స్‌లో డీసీ (ట్రైనింగ్)గా ఉన్న కె.శ్రీనివాసులును బదిలీ చేశారు. కాగా, మన్యం జిల్లాలో సెబ్ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ)గా పనిచేస్తున్న ఎం.రవికుమార్‌రెడ్డిని అదే హోదాలో గుంటూరుకు, బాపట్ల డీపీఈఓగా పనిచేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఈఎస్) ఎ.అరుణ కుమారిని గుంటూరు ఈఎస్‌గా బదిలీ చేశారు.

29 నుంచి శివాలయంలో పవిత్రోత్సవాలు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 29వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ బుధవారం తెలిపారు. పెదకాకానిలో ఈ శివాలయంలో పవిత్రోత్సవాలను పురస్కరించుకుని మూడు రోజుల పాటు రాహుకేతు పూజలు, అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు వెల్లడించారు. అక్టోబరు 2వ తేదీన అమావాస్యను పురస్కరించుకుని రాహుకేతు పూజలతోపాటు ఇతర అన్ని కార్యక్రమాలు యథావిధిగా జరుగుతాయని వివరించారు.

యార్డుకు 53,149 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు బుధవారం 53,149 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 51,039 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 18,600 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ.9,000 నుంచి రూ.16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.9,000 నుంచి రూ.18,700 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 26,374 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

పారదర్శకత పేరు..

ప్రాధాన్యం వేరు!

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగుదేశం మద్దతుదారులు, అభిమానులకు పెద్దపీట వేస్తోంది కూటమి సర్కారు. పారదర్శకత పేరుతో అయిన వారిని అందలం ఎక్కిస్తోంది. ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన జనసేనాని పవన్ కళ్యాణ్ సామాజిక వర్గీయులను కూడా పక్కన పెట్టేస్తోంది. ఇక బీసీ, ఎస్సీ, ఎస్టీల పరిస్థితి చెప్పనక్కర్లేదు. దీంతో వారు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. నియామకాలు, బదిలీల్లో టీడీపీ వర్గీయుల లీలలు అన్నీఇన్నీ కావు. అడ్డగోలుగా తమకు నచ్చిన రీతిలో కొత్త పదవులు సృష్టించడం, అయిన వారికి కీలక పదవులు కట్టబెట్టడం చూసి విద్యావంతులు, మేధావులు విస్తుపోతున్నారు. ఉన్నత విద్యను ఇంకా మెరుగుపరచాల్సిన వర్సిటీలో ఇలాంటి రాజకీయాలు చేయడంపై మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎన్‌యూలో టీడీపీ వర్గానికే కీలక పదవులు

- నియామకాలు, బదిలీల్లోనూ వారిదే ఆధిపత్యం
- జనసేన వారికి అన్నింట్లోనూ మొండిచేయి
- అడ్డగోలుగా నియామకాలు, కొందరు ఉద్యోగుల తొలగింపు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పాలకులు, అధికార వర్గానికి చెందిన వారు అంతా తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్న తీరు అందర్నీ ముక్కున వేలేసుకునేలా చేస్తోంది. వర్సిటీల్లో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పుతాం, సామాజిక సమానత్వానికి ప్రాధాన్యమిస్తామని ఊదరగొడుతున్న విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం పక్కనే ఉన్న ఏఎన్‌యూలోనే ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. పాలన, కార్యనిర్వహణ పదవుల భర్తీతోపాటు ఉద్యోగుల బదిలీలు, నియామకాలు వంటి అన్ని విషయాల్లో ఏఎన్‌యూ పాలకులు, వారి వెనుక ఉన్న ప్రభుత్వ పెద్దలు తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. అధికారంలోకి వచ్చే వరకు అందరికీ అవకాశాలు అన్నట్లుగా వ్యవహరించిన చంద్రబాబు సామాజిక వర్గం.. ప్రభుత్వం ఏర్పడగానే సొంత సామాజిక వర్గ ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తుండటం చూసి విద్యావంతులు విస్తుపోతున్నారు.

జనసేన వారికి చుక్కెదురు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యూనివర్సిటీలో అప్పటి వరకు పాలన, కార్యనిర్వహణ పదవుల్లో ఉన్న వారిని తొలగించారు. కొత్త వారికి పదవులు కట్టబెట్టారు. వీటిలో జనసేన వర్గానికి మొండిచేయి చూపించారు. వర్సిటీలో 15కు పైగా పరిపాలన, కార్యనిర్వహణ పదవులు భర్తీ చేస్తే.. వాటిలో కీలక పదవులతోపాటు ఎక్కువ భాగం చంద్రబాబు నాయుడు సామాజిక వర్గం వారికే ఇచ్చుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో పవన్ కళ్యాణ్ భాగస్వామ్యం ఎంతో ఉందని, తమ వర్గానికి ఏఎన్‌యూలో అధిక ప్రాధాన్యం ఉంటుందని జనసేన వర్గాలు, ఆయన సామాజిక వర్గ ఉద్యోగులు ఆశించారు. కానీ తొలిసారి ప్రకటించిన పదవుల్లో ఇన్‌చార్జి వీసీ, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్‌తోపాటు ఆరు కీలక పదవులు చంద్రబాబు సామాజిక వర్గానికే దక్కాయి. జనసేనకుగానీ, పవన్ కళ్యాణ్ సామాజిక వర్గానికిగానీ ఒక్క పదవి కూడా ఇవ్వలేదు. దీంతో జనసేన మద్దతుదారులైన ఉద్యోగులు ప్రత్యేకంగా సమావేశమై నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. తక్కువ ఓటు శాతం ఉన్న చంద్రబాబు సామాజిక వర్గం కీలకమైన ఎక్కువ పదవులు తీసుకుని, ఎక్కువ ఓటు శాతం ఉన్న తమకు ఇలా అన్యాయం చేయడమేంటని కొందరు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది గ్రహించిన పాలకులు, ప్రభుత్వ పెద్దలు.. జనసేన వర్గానికి నామమాత్రంగా రెండు పదవులు ఇచ్చారు. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి కీలకంగా వ్యవహరించిన బీసీ, ఎస్సీ వర్గాలకు ఏఎన్‌యూ పదవుల్లో న్యాయపరంగా దక్కాల్సిన ప్రాతినిధ్యం కూడా లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అడ్డగోలుగా తొలగింపు

యూనివర్సిటీలో పారదర్శకతకు పెద్దపీట వేస్తామని, ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారనే సాకుతో పాలకులు ఇటీవల 21 మంది క్యాజువల్ వర్కర్లను ఉద్యోగాల నుంచి తొలగించారు. మరికొందరిని తొలగించేందుకు ఇప్పటికే రంగం సిద్ధం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మరో పక్క ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సులు నెరవేర్చేందుకు తెరవెనుక నియామకాలు చేపడుతున్నారు. యూనివర్సిటీలో ఇంజినీరింగ్, ఇతర కళాశాలల్లో ఇటీవల చేపట్టిన అతిథి అధ్యాపకుల నియామకం కూడా పెద్దఎత్తున చర్చకు దారితీసింది. ఉన్నత బోధనా ప్రమాణాలే తమ లక్ష్యమని చెబుతున్న మంత్రి లోకేశ్.. కనీస అర్హతలు కూడా లేని వారిని వర్సిటీలో నియమించడంపై ఏం సమాధానం చెబుతారని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు.

అయిన వారికి అందలం

యూనివర్సిటీలో కనీసం ఇంటర్వ్యూ కూడా నిర్వహించకుండా గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఓ వ్యక్తికి ఓ సెంటర్ ఏర్పాటు చేసి, అడ్డదారిలో ఉద్యోగం కట్టబెట్టారు. ఆ తరువాత వక్రమార్గంలో వేతనం, హోదా పెంచేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పదవి కట్టబెట్టాలని రంగం సిద్ధం చేశారు. అధికార పక్షంలోనే కొన్ని వర్గాలు ప్రశ్నించడంతో పక్కన పెట్టారు. ఆగమేఘాలపై అతడిని ఏసీటీఏ (అడిషనల్ చీఫ్ టీచర్ అసోసియేట్)గా నియమించారు. అసలు ఆచార్యుడే కాని వ్యక్తికి ఈ పదవి ఎలా ఇస్తారని అందరూ విస్తుపోయారు. ఇలాంటి ఘటనలు వర్సిటీలో ఓ వర్గం ఆధిపత్యానికి నిదర్శనమని కూటమిలో ఉన్న ఇతర వర్గాలే ఆరోపిస్తున్నాయి. ఉద్యోగుల బదిలీల్లోనూ అదే పరిస్థితి. పరీక్షాభవన్‌లో కీలక స్థానంలో ఉన్న ఓ అధికారిని అక్కడి నుంచి బదిలీ చేసేందుకు ఇష్టపడని వర్సిటీ యంత్రాంగం.. ఆయనకోసం ప్రత్యేకంగా పరీక్షల నోడల్ ఆఫీసర్ అనే పోస్టును సృష్టించింది. పరీక్షల నిర్వహణకు కో ఆర్డినేటర్లు, వారి కింద డిప్యూటీ రిజిస్ట్రార్ కేడర్ అధికారులు, సీఈ, ఏసీఈ వంటివారున్నారు. ఇదంతా కాదని ఓ పోస్టు క్రియేట్ చేసి, ఆయనకు కట్టబెట్టడం ఏంటని విస్తుపోతున్నారు.

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా అంబటి



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలువురిని వివిధ పదవుల్లో నియమించారు. ఈ మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలు వెలువడ్డాయి. వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి అంబటి రాంబాబును నియమించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆయన సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిగా పనిచేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఆయన్ను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి.

గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడిగా మోదుగుల



గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డిని నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. గతంలో నరసరావుపేట ఎంపీగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆయన ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ ఇన్‌చార్జిగా కూడా పనిచేశారు.

మంగళగిరి సమన్వయకర్తగా దొంతిరెడ్డి



వైఎస్సార్‌సీపీ మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా దొంతిరెడ్డి శంకర్‌రెడ్డి (వేమారెడ్డి)ని నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుతం దొంతిరెడ్డి మంగళగిరి, తాడేపల్లి పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఉన్నారు.

నిండా మునిగినా..

నిమ్మకు పరిహారం లేదు!

పంట నష్టం వివరాల నమోదులో నిమ్మను పరిగణనలోకి తీసుకోవటం లేదు. ఉద్యాన అధికారులు కనీసం అటువైపు కూడా చూడటం లేదు. భారీ వర్షాలు, వరదలకు నిమ్మ తోటల్లో అయిదారు అడుగుల మేర నీరు రోజుల తరబడి నిలిచింది. దీంతో వేళ్లు కుళ్లిపోయి క్రమంగా చెట్టు చనిపోతుందని రైతులు చెబుతున్నారు. భూమి స్వభావం కూడా మారే అవకాశం ఉందని, శాస్త్రవేత్తలు పరిశీలించి తగు సూచనలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఇవేవీ పట్టించుకోవటం లేదని.. ఇప్పుడు పరిహారం కూడా ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణతో రైతులు

- పంట నష్టం జాబితాలో దక్కని చోటు
- తహసీల్దార్‌ను కలిసిన బాధిత రైతులు
- జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామీ
- కొన్నిచోట్ల అరటి తోటలకూ మొండిచేయి

తెనాలి: జూలై నెలలో, గత నెల 31, సెప్టెంబరు ఒకటో తేదీన కురిసిన భారీ వర్షాలకు తోడు వరద పోటెత్తడంతో నిమ్మ తోటల్లో అసాధారణమైన రీతిలో నీరు నిలిచింది. కాజ టోల్‌గేట్, ఆ పరిసరాల్లోని వరద నీరు దిగువకు ప్రవహించింది. గుంటూరు నల్ల, తుంగభద్ర డ్రెయిన్లకు వరద పోటెత్తింది. దీంతో తెనాలి నియోజకవర్గంలోని సంగంజాగర్లమూడి, అంగలకుదురు, వేమూరు నియోజకవర్గంలోని దుండిపాలెం, యడ్లపల్లి, వలివేరు, చుండూరు, మోదుకూరు పరిధిలోని పంట చేలను ముంచెత్తింది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో సాగు చేసే నిమ్మ తోటల్లోనూ వరద నీరు చేరింది. 7-8 అడుగుల ఎత్తులో చెట్లు ఉండే నిమ్మ తోటల్లో 4-6 అడుగుల మేర ముంపు తప్పలేదు. ఈ నెల 10వ తేదీ వరకూ పూర్తిస్థాయిలో నీరు బయటకు వెళ్లనేలేదు.

అటువైపు చూసిన వారే లేరు..

ఈ పరిణామం నిమ్మ రైతులను కలవరపెట్టింది. తోటల్లో నీరు ఎక్కువ రోజులు నిలిచి ఉండటం గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ లేదు. దీంతో మొక్కలకు నష్టం జరుగుతోంది. పెద్ద తోటల్లో కొత్త చిగురు రాకుండా తెగుళ్లు ఆశిస్తూ, క్రమంగా చెట్టు ఎండిపోతోందని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో నిమ్మ చెట్టు 15-20 ఏళ్ల వరకు కాపు ఇస్తుంది. అలాంటి చెట్టు చనిపోతే మళ్లీ కొత్త మొక్క నాటి, అది పెరిగి, దిగుబడి రావటానికి అయిదేళ్లు పడుతుందని తెలిసిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యాన అధికారులు, సంబంధిత శాస్త్రవేత్తలు నిమ్మ తోటలను పరిశీలించి, తగిన సూచనలు చేయాలని రైతులు కోరారు. ఆ పరిశీలన సంగతి అటుంచితే.. ఇప్పటి వరకు నిమ్మ తోటల వైపు ఎవరూ రానే లేదని రైతులు వాపోతున్నారు.

నష్టం నమోదు చేయరూ..

పంట నష్టం నమోదులో నిమ్మ తోటలను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అదేమంటే ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో తగిన ఆదేశాలు లేవని అధికారులు చెబుతున్నారని తెలిపారు. దీనితోపాటు కొల్లిపర మండలంలోని కొన్ని గ్రామాల్లో వరద నీటిలో రోజుల తరబడి ఉన్న అరటి తోటలను కూడా పంట నష్టంలో పరిగణనలోకి తీసుకోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం పలువురు రైతులు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి నేతృత్వంలో తెనాలి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను కలిశారు. రైతుల ఆవేదనను విన్న తహసీల్దార్.. ఫోన్‌లో ఉద్యాన అధికారితో మాట్లాడారు. తెనాలి మండలం అంగలకుదురు, సంగంజాగర్లమూడి గ్రామాల్లో నిమ్మ, అరటి పంటల నష్టాన్ని ఎందుకు నమోదు చేయటం లేదని ప్రశ్నించారు. అందుకు తగిన ఉత్తర్వులు లేవని వారు సమాధానమిచ్చారు. దీంతో సమస్యను జిల్లా కలెక్టర్, ఉద్యానశాఖ అధికారి దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ సదరు రైతులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రూ.10 వేలు, రూ.14 వేలు ఏమాత్రం సరిపోవని రైతులు వెలగా ఆదినారాయణ, పాపోపలు శ్రీనివాసరావు చెప్పారు. పరిహారం ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వాలని కోరారు.



ఇటీవల వరదతో ముంపునకు గురైన నిమ్మతోట



తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పార్టీ గుంటూరు జిల్లా ముఖ్య నేతలు - సాక్షి ఫొటోగ్రాఫర్

వరుస చోరీలకు త్వరలోనే చెక్

- తరచూ దొంగతనాలు జరిగే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే సిబ్బంది పెంపు
- సైబర్ నేరాలపై అవగాహన కల్పనకు కార్యాచరణ
- 'సాక్షి'తో జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్

''నగరంలో జరుగుతున్న వరుస దొంగతనాలకు చెక్ పెడతాం. ఇటీవల జరిగిన చోరీ కేసులను ఛేదించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలతో దర్యాప్తు వేగవంతం చేశాం. సాధ్యమైనంత త్వరగా నిందితులను పట్టుకునే పనిలో ఉన్నాం. చోరీలు జరగకుండా ప్రజలు సైతం జాగ్రత్తలు పాటించాలి. పోయిన తర్వాత వెతకటం కంటే అసలు దొంగతనం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెడతాం.''

- 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలో జనసంచారం తక్కువగా ఉండి, ధనిక వర్గాలు ఎక్కువగా ఉన్న పట్టాభిపురం తదితర స్టేషన్ల పరిధిలోనే ఎక్కువ దొంగతనాలు జరుగుతున్నాయని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ పేర్కొన్నారు. చోరీలు, ట్రాఫిక్, సైబర్ నేరాలు తదితరాలపై శాఖాపరంగా ఆయన పలు విషయాలను వివరించారు. ఇంకా వివిధ అంశాలపై ఆయన స్పందించారు. వివరాలు ఆయన మాటల్లోనే... ''స్టేషన్లు కొత్తగా ఏర్పాటు చేసినప్పటికీ జనాభా పెరుగుదలకు అనుగుణంగా సిబ్బంది పెరగలేదు. ఉన్న సిబ్బందితో ప్రతి ఏరియాలోనూ రాత్రి, పగలు గస్తీ నిర్వహిస్తున్నాం. అయినా దొంగతనాలను అరికట్టేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే వేలిముద్రలు, సాంకేతిక పరిజ్ఞానంలో అనుభవం కలిగిన వారితో గాలిస్తున్నాం. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో నాకాబందీ నిర్వహించి, వందల్లో వాహనాలు సీజ్ చేశాం. నేరాల నియంత్రణలో పోలీసులతోపాటు ప్రజల బాధ్యత కూడా ఉంది. ఊళ్లకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. దీనిపై ప్రచారం చేస్తున్నా ఎక్కువ మంది ఆలకించడం లేదు. ఎవరైనా సమాచారం ఇస్తే వారి ఇళ్లకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్) ఏర్పాటు చేస్తాం. తద్వారా ఏదైనా చోరీయత్నం జరిగితే వెంటనే సమాచారం వస్తుంది. అప్పుడే నిందితులను పట్టుకోవచ్చు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, ఇంట్లో ఏదైనా ఖరీదైన బంగారు వస్తువులు ఉన్నప్పుడు తీసుకెళ్లి బ్యాంక్ లాకర్స్‌లో భద్రపరచుకోవడం, అధునాతనమైన డోర్ అలారం ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలి. గతంలో కాకినాడ ప్రత్తిపాడులో మూడు కిలోల బంగారం చోరీ జరిగితే నెల రోజుల్లో కేసును ఛేదించడమే కాకుండా, బంగారం రికవరీ చేశాం. అది కూడా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర గ్యాంగ్‌లను పట్టుకుని చేశాం. ఆ అనుభవంతో గుంటూరులో జరుగుతున్న వరుస దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించాం. తరచూ దొంగతనాలు జరిగే ఏరియాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించాం. ఊరెళ్తున్న క్రమంలో యజమానులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. ఆరుబయట లైట్ పొద్దస్తమానం వెలుగుతుండటం, దినపత్రికలు ఫ్లాట్ లేదా ఇళ్ల ముందు పడి ఉండటం వంటివి దొంగతనాలు చేసే వారికి మరింతగా కలిసి వస్తున్నాయి.



ట్రాఫిక్ సమస్యలపైనా ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టాక గుంటూరు నగరంలో ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించా. ఈ క్రమంలో తూర్పు, పశ్చిమ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లకు అదనంగా ఇద్దరు చొప్పున ఎస్‌ఐలను నియమించాం. తూర్పులో పది మంది, పశ్చిమలో పది మంది సిబ్బందిని అదనంగా తీసుకొచ్చాం. దీంతో కొంత మేర ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే అవకాశం కలిగింది. గుంటూరు నగరంలో 16, నగరం బయట మరో 13 ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తాం. రోడ్లపై ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. అనధికార పార్కింగ్‌లను గుర్తించి త్వరలో చర్యలు తీసుకుంటాం.''

సైబర్ నేరాలపై అవగాహన పెంచుతాం

'' సైబర్ నేరాల నియంత్రణ కోసం అసోసియేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించేందుకు కృషి జరుగుతోంది. సరికొత్తగా దుండగులు ఎత్తులు వేసి మోసాలు చేస్తున్నారు. గతంలో ఓటీపీ పేరుతో మోసాలు జరిగేవి. ప్రజల్లో అవగాహన పెరగడంతో అవి తగ్గిపోయాయి. ఇప్పుడు కొత్త తరహాలో లింక్‌లు పంపించడం, ఆ లింక్ క్లిక్ చేస్తే డబ్బులు స్వాహా చేయడం కనిపిస్తోంది. విదేశాల నుంచి పార్శిల్ వచ్చిందని, అందులో గంజాయి ఉందని, కేసు లేకుండా ఉండాలంటే నగదు చెల్లిస్తే ఎఫ్ఐఆర్ లేకుండా చేస్తామని కొత్త రకం మోసానికి తెరలేపారు. యాప్‌లో పెట్టుబడి పెట్టాలని వంటి కొత్త తరహా నేరాలు జరుగుతున్నాయి. ఇలాంటి నేరాలను నియంత్రించేందుకు బ్యాంకర్లు, పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, అపార్టుమెంటు వాసులు తదితర సంఘాల ప్రతినిధులను భాగస్వామ్యం చేస్తున్నాం. పెద్దఎత్తున సైబర్ నేరాలపై అవగాహన కల్పించనున్నాం. నేరం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే సాధ్యమైనంత త్వరగా కేసు ఛేదించే అవకాశం ఉంటుంది. నగదు వేరే ఖాతాలకు మళ్లకుండా బ్లాక్ చేసే వీలు కలుగుతుంది. అవగాహనతో ప్రజలు ఈ విషయాలను గమనించాలి.''

క్లుప్తంగా

జిల్లాలో పలుచోట్ల వానలు

దుగ్గిరాలలో 97.8 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): అల్పపీడనం ప్రభావంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 97.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 9.2 మి.మీ. పడింది. సగటు 44.9 మి.మీ.గా నమోదైంది. కాకుమాను మండలంలో 92.2, పొన్నూరు 79.2, గుంటూరు పశ్చిమ 72, పెదనందిపాడు 70.4, పెదకాకాని 66.2, గుంటూరు తూర్పు 58.2, కొల్లిపర 42.6, తెనాలి 37.4, మంగళగిరి 32.2, తుళ్ళూరు 30.8, ఫిరంగిపురం 27.6, చేబ్రోలు 24, తాడికొండ 22.6, వట్టిచెరుకూరు 19.8, తాడేపల్లి 16.4, ప్రత్తిపాడు మండలంలో 9.4 మి.మీ చొప్పున పడింది. సెప్టెంబర్ 25వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 121 మి.మీ. కాగా.. ఇప్పటి వరకు 303 మి.మీ. నమోదైంది. పంట పొలాల్లో నీరు నిల్వకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

2న హిందీ ప్రచార గురుపీఠ పురస్కారాలు ప్రదానం

తెనాలి: గాంధీ జయంతి, బోయపాటి నాగేశ్వరరావు– సుభద్రాదేవి గురు దంపతుల 22వ వార్షిక హిందీ ప్రచార గురుపీఠ పురస్కార ప్రదాన వేడుక అక్టోబరు 2న నిర్వహించనున్నారు. దీనికి స్థానిక నాజరుపేటలోని హిందీ ప్రేమీమండలి మహావిద్యాలయం వేదిక కానుంది. మహావిద్యాలయం అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షత వహిస్తారు. విజయవాడలోని దక్షిణ భారత హిందీ ప్రచారసభ స్నాతకోత్తర కళాశాల, ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి కళాశాల హిందీ విభాగం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ మోహన్‌రావు కొల్లి, విశాఖపట్నంలోని నేవీ చిల్డ్రన్ స్కూల్ సీనియర్ హిందీ అధ్యాపకురాలు డాక్టర్ నిర్మలాదేవి చిట్టిళ్లకు గురుపీఠ పురస్కారాలను ప్రదానం చేయనున్నారు.

రేపు గ్రహణమొర్రి ఉచిత స్క్రీనింగ్ క్యాంపు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రహణమొర్రితో బాధపడుతున్న వారికి ఈ నెల 27న ఉచిత స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నారు. ఈ మేరకు గుంటూరు జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల నుంచి 50 ఏళ్ల వరకు వయస్సున్న గ్రహణమొర్రి బాధితులు 27న ఉదయం 10 గంటలకు గుంటూరు బ్రాడీపేట 2/13లోని శారదానికేతన్ ప్రాంగణంలో ఉన్న భవిత కేంద్రంలో హాజరు కావాలని సూచించారు. హైదరాబాద్‌లోని బసవ తారకం క్యాన్సర్ ఆస్పత్రి, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఈ క్యాంపు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 99890 85102 ఫోను నెంబర్లో సంప్రదించాలని ఆమె సూచించారు.

మహిళా సాధికారతకు భవనం వినియోగం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- రూ.6 కోట్ల భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించిన కస్తూరిబాయి


కస్తూరిబాయి దంపతులను సన్మానిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్: మహిళా సాధికారతకు కృషి చేసిన డాక్టర్ ముద్దన కస్తూరిబాయి ఆశయాలకు అనుగుణంగా కొత్తపేటలోని మహిళా మండలి భవనాన్ని వినియోగిస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి కొత్తపేటలోని మహిళా మండలి భవనాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తూ బుధవారం అధ్యక్షురాలు డాక్టర్ ముద్దన కస్తూరిబాయి రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను మంత్రి మనోహర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మహిళా మండలిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు ముందడుగు వేయాలనే ఉద్దేశంతో ఈ మండలిని ఏర్పాటు చేసి వివిధ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయం అన్నారు. సభ్యులు తమ నగదును వీటి కోసం వినియోగించారని గుర్తుచేశారు. విలువలు కనుమరుగు అవుతున్న నేటి రోజుల్లో రూ.కోట్ల విలువ చేసే భవనాన్ని ప్రభుత్వానికి అప్పగించటం అభినందనీయం అన్నారు. వారి స్ఫూర్తిని రానున్న రోజుల్లో కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కొద్ది నెలల్లో భవనానికి మరమ్మతులు చేయించి, దాతలు కోరిన విధంగా మహిళా సాధికారిక కార్యక్రమాలకు ఉపయోగిస్తామని ప్రకటించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, సబ్ కలెక్టర్ సంజనా సింహలు మాట్లాడుతూ.. ఎక్కువ మంది ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకుంటున్న నేటి రోజుల్లో కస్తూరిబాయి వంటి వారు విలువైన స్థలాన్ని సర్కారుకు అప్పగించటం తాము ఎప్పటికీ మరువబోమన్నారు. ఇలాంటి వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. మహిళా మండలి భవనం ఉన్న స్థలం 514 చదరపు గజాలు అని, మార్కెట్ విలువ రూ.6 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. డాక్టర్ ముద్దన కస్తూరిబాయి మాట్లాడుతూ.. దాతల సహకారంతో 1964లో స్థలం కొనుగోలు చేసి భవనం నిర్మించామన్నారు. అప్పటి నుంచి సభ్యుల సహకారంతో అనేక కార్యక్రమాలు నిర్వహించామని గుర్తుచేశారు. దీనిని మహిళల అభ్యున్నతికి ఉపయోగించాలని కోరారు. అనంతరం మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ ముద్దన కస్తూరిబాయి దంపతులు, కార్యదర్శి కె. ఝాన్సీ కుమారిలను సన్మానించారు. ప్రభుత్వం తరపున అభినందన సర్టిఫికెట్‌ను కస్తూరిబాయికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తెనాలి సబ్ రిజిస్ట్రార్ రమణ కుమార్, సీనియర్ న్యాయవాది వెలినేని రాఘవయ్య, డీఎస్పీ జనార్దనరావు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు రూ. 4 లక్షల విరాళం


డాక్టర్ కిరణ్‌కుమార్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ నేతలు

గుంటూరు మెడికల్ : ఏపీ న్యూరో సైంటిస్ట్ అసోసియేషన్ నేతలు బుధవారం గుంటూరు జీజీహెచ్‌కు రూ. 4 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆగస్టులో గుంటూరులో అసోసియేషన్ రాష్ట్ర సమావేశం విజయవంతంగా జరిగింది. అప్పటి నిర్ణయం మేరకు జీజీహెచ్ న్యూరాలజీ, న్యూరోసర్జరీ వైద్య విభాగాలకు ఈ మొత్తం ఇచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ విరాళంతో విద్యార్థుల కోసం ల్యాప్‌టాప్‌లను కొనుగోలు చేశామన్నారు. దాతలను అభినందించారు. సీనియర్ న్యూరాలజిస్టులు డాక్టర్ తారక్‌నాథ్, డాక్టర్ పమిడిముక్కల విజయలు ఆసుపత్రి అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణ కుమారి, న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద, డాక్టర్ భార్గవీ దేవి, డాక్టర్ చక్కా శివరామ కృష్ణ, డాక్టర్ వీరమ్మ పాల్గొన్నారు.

స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్ఓ స్టాండర్డ్ సర్టిఫికెట్

అత్యంత నాణ్యతా ప్రమాణాలతో పేద రోగులకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్న గుంటూరు జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలోని స్ట్రోక్ యూనిట్‌కు ఐఎస్ఓ స్టాండర్డ్ సర్టిఫికేషన్ లభించింది. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం మీడియాకు వెల్లడించారు.

వినాయక చవితి విధుల నిర్వహణ భేష్



నగరంపాలెం: వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలోని మండపాలు, నిమజ్జన ఊరేగింపుల వద్ద జిల్లా అధికారులు, సిబ్బంది విధులు సమర్థంగా నిర్వహించారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో అభినందించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్టమైన బందోబస్తు చేపట్టారని అన్నారు. సమర్థంగా విధులు నిర్వర్తించిన వారికి త్వరలో రివార్డులు అందజేస్తామని పేర్కొన్నారు. రానున్న విజయదశమి పండుగ సందర్భంగా ఇదే స్ఫూర్తితో విధులు నిర్వహించాలని సూచించారు.

ఆకస్మిక తనిఖీలు

పట్నంబజారు: జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం గుంటూరు నగరంలోని లాలాపేట, ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని పట్నంబజారు రోడ్డులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజయదశమి పండుగ రానున్న సందర్భంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తీసుకున్న చర్యలు చూసి అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: సీజనల్ వ్యాధులపై గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల ఎస్పీఎం వైద్యులతో డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి బుధవారం సమావేశం నిర్వహించారు. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఏ సీతారామ్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తేజ్ కుమార్, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్ సుగుణ రాజు హాజరయ్యారు. డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఎస్పీఎం వైద్యులతో రాపిడ్ రెస్పాన్స్ టీములు ఏర్పాటు చేస్తామన్నారు. వీటితో తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండల పరిధిలోని గ్రామాల్లో ఎపిడమియలాజికల్ సర్వే నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, తాజా ఆహారాన్ని భుజించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అనారోగ్యానికి గురైతే సమీపంలోని ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఆస్పత్రి వద్దకు వెళ్లాలని సూచించారు. సర్వేకు ప్రజలు సహకరించి, సేవలను వినియోగించుకోవాలని కోరారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన

వేతనాల బిల్లు సమర్పణకు మెలిక పెడుతున్న నర్సింగ్ అధికారులు


నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు బుధవారం కూడా విధులు బహిష్కరించారు. సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ నెల 4న విడుదల చేసిన జీవో నెంబరు 115ను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రెగ్యులర్ స్టాఫ్ నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సుల యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి,సంధ్య, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

జీతాల బిల్లు కోసం తిప్పలు

జీజీహెచ్‌లో 20 రోజులుగా కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు తమ సర్వీసును రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నారు. వారికి వేతనాల బిల్లు సమర్పించేందుకు అధికారులు మెలిక పెట్టారు. వారు లిఖిత పూర్వకంగా ఒకరోజు సెలవు పెట్టుకున్నట్లు లేఖ ఇస్తేనే వేతనాలు విడుదల చేసే బిల్లు హాజరు వివరాలు పంపిస్తామని నర్సింగ్ అధికారులు చెబుతున్నారు. దీంతో మూడు రోజులుగా కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది సంతకాల కోసం సూపరింటెండెంట్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వాస్తవానికి రోజూ అనుమతి తీసుకుని రెండు గంటలు మాత్రమే నిరసన ప్రదర్శన చేస్తున్నప్పటికీ.. ఒక్కరోజు పూర్తిగా విధులకు హాజరు కాలేదంటూ నర్సింగ్ అధికారులు తమను ఇబ్బంది పెడుతున్నారని కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు వాపోతున్నారు. ప్రతినెలా ఉండే క్యాజువల్ లీవ్స్‌లో ఒక లీవును తగ్గించి వేతనాలు మంజూరుకు హాజరు పంపిస్తే సరిపోతుందని పేర్కొంటున్నారు. ఆ విధంగా చేయకుండా లిఖిత పూర్వకంగా సంతకాల పేరుతో తమను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సుల యూనియన్ నాయకులు సైతం ఈ సమస్యలను నర్సింగ్ అధికారులతో మాట్లాడి సామరస్యంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. మరోపక్క యూనిఫాం వేసుకుని నిరసన కార్యక్రమాలు ఆసుపత్రిలో చేయడానికి వీలు లేదని, ఆసుపత్రి ఆవరణలో టెంట్ వేయొద్దని తరచూ కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులపై ఆసుపత్రి అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వైద్యులు సమ్మెలు చేసినప్పుడు వారికి మద్దతుగా ఆసుపత్రి అధికారులంతా ధర్నాలకు సైతం కూర్చొని సంపూర్ణ మద్దతు తెలియజేశారని, తమకు మాత్రం కనీసం నిరసన తెలిపేందుకూ ఆంక్షలు విధిస్తున్నారని బాధితులు వెల్లడించారు. తమ నిరసన ప్రభుత్వం దృష్టికి వెళ్లకపోతే సమస్య పరిష్కారం కాదని వాపోతున్నారు.

భోజనంలో నాణ్యతాలోపంపై ఆగ్రహం

- ఏజెన్సీ నిర్వాహకులపై సమగ్ర శిక్ష ఏపీసీ మండిపాటు
- విద్యార్థుల గైర్హాజరు గురించి హెచ్ఎం వివరణపై అసంతృప్తి


ఏజెన్సీ నిర్వాహకులకు హెచ్చరిస్తున్న ఏపీసీ జి.విజయలక్ష్మి

ప్రత్తిపాడు: పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేకపోవడంపై సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ భోజనం తినని విద్యార్థుల ట్యాబ్‌లు రిటర్న్ తీసుకోవాలని కూడా హెచ్ఎంను ఆదేశించారు. మండల పరిధిలోని చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును బుధవారం ఏపీసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నాణ్యత, రుచి లోపించడంతో ఏజెన్సీ నిర్వాహకురాలు కుమారిని ప్రశ్నించారు. కూర చేశామంటే చేశామన్నట్లుగా ఉండకూడదన్నారు. గుజ్జు కోసం కూర మొత్తంలో శనగపిండి కలపడం సరికాదని పేర్కొన్నారు. భోజనం, కూరలు వండే పద్ధతి మార్చుకోవాలని స్పష్టం చేశారు. మరో రెండు సార్లు వస్తానని, నాణ్యత ఇలానే ఉంటే ఏజెన్సీని మారుస్తామని హెచ్చరించారు. భోజనం, కూరలు ఇలా వండుతుంటే ఏం చేస్తున్నారని హెచ్ఎం విజయ్‌కుమార్‌ను ప్రశ్నించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. మొత్తం 205 మంది విద్యార్థులకుగాను 170 మంది వచ్చారు. దీనిపై హెచ్ఎంను ప్రశ్నించారు. గైర్హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేశారా..? అని అడిగారు. చేయలేదని హెచ్ఎం సమాధానమిచ్చారు. దీంతో అసహనానికి గురైన ఏపీసీ.. జిల్లాలో విద్యార్థుల హాజరు 40 శాతం మాత్రమే ఉంటోందని గుర్తుచేశారు. గైర్హాజరయ్యే విద్యార్థుల శాతంలో విశాఖపట్నం తర్వాత రెండో స్థానంలో గుంటూరు జిల్లా ఉందన్నారు. దీంతో కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు రివ్యూ చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు గైర్హాజరవ్వకుండా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను క్షేత్రస్థాయిలో హెచ్ఎంలకు చెప్పడం లేదా అంటూ ఎంఈవోలు రమాదేవి, లీలారాణిలను ప్రశ్నించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కొందరు మధ్యాహ్న భోజనం తినడం లేదని చెప్పడంతో తినని వారి ట్యాబ్‌లను వెనక్కి తీసుకోవాలని ఏపీసీ ఆదేశాలు జారీ చేశారు. మధ్యాహ్నం భోజనంలో నాణ్యత లేకపోవడం వల్లే విద్యార్థులు తినడం లేదని వారి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. భోజనంలో నాణ్యత పెంచితే తమ పిల్లలకు తినడానికి సమస్య ఏముంటుందని చెబుతున్నారు. ఏపీసీ ఈ విషయం గమనించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎథికల్ హ్యాకింగ్‌లో చలపతి కళాశాల విద్యార్థి ప్రతిభ


అజయ్‌భాస్కర్‌ను అభినందిస్తున్న యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారులోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కటం సంతోషంగా ఉందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కళాశాలలో కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ విభాగానికి చెందిన సిద్ది అజయ్‌భాస్కర్ ఈసీ కౌన్సిల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 29వ తేదీన జరిగిన సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్ ఎగ్జామ్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడని తెలిపారు. 125 మార్కులకుగాను 124 సాధించి 19 సంవత్సరాలకే ఎంగెస్ట్ సర్టిఫైడ్ ఎథికల్ హ్యాకర్‌గా నిలిచాడన్నారు. అజయ్‌భాస్కర్‌ను చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రైతాంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం


కొండేపాడులో పత్తి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న డి.వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: రైతాంగ సమస్యల పరిష్కారంతోపాటు వ్యవసాయంలో వస్తున్న మార్పులను వారికి తెలియజేయడమే లక్ష్యంగా పొలం బాట చేపట్టినట్లు వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం డీడీఏ డి.వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కొండేపాడు, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కొండేపాడులో కార్యక్రమాన్ని డీడీఏ పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంటల సాగు, ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యల తీవ్రతను బట్టి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త గంగాభవాని మాట్లాడుతూ.. రైతులు అధిక సాంద్రత గల పత్తి మొక్కలను నాటాలన్నారు. తక్కువ వ్యవధిలో అధిక దిగుబడులు వస్తాయని పేర్కొన్నారు. వీరికి రూ. 5 వేల ప్రోత్సాహక నగదును అందిస్తున్నామని వివరించారు. ఏవో అరుణకుమారి, పశువైద్యాధికారి డాక్టర్ నందకిషోర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ వర్గీయులు 8 మంది అరెస్టు

పెదకాకాని: ఉత్సవ సమయంలో జరిగిన వివాదంలో వైఎస్సార్ సీపీ వర్గీయులపై కేసు నమోదు అయింది. పెదకాకాని మండలం అనుమర్లపూడి గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు గ్రామంలో వినాయక చవితిని పురస్కరించుకుని గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ నెల 12వ తేదీన నిమజ్జనం సందర్భంగా గ్రామోత్సవం ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో పంచాయతీ కార్యాలయం మీదుగా ఊరేగింపు వెళుతున్న క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసిరారు. ఈ దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. వారిలో నలుగురికి స్వల్పంగా కాగా, రేఖా సాంబశివరావు తలకు గాయమైంది. ఆయనకు తెనాలి ఆసుపత్రిలో చికిత్స చేశారు. బాధితుడు రేఖా సాంబశివరావు ఫిర్యాదు మేరకు వైఎస్సార్ సీపీకి చెందిన దానబోయిన మణికంఠ, నాగేశ్వరరావు, గంగాధరరావు, నాగరాజు, ఆరాధ్యుల ఫణీంద్రలతోపాటు మరికొంత మంది అని ఉదహరిస్తూ శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో 324గా కేసు నమోదు చేశారు. రెండు రోజుల కిందట స్టేషన్ బెయిల్ కోసం రావడంతో డాక్టర్ నివేదిక మేరకు (నూన్‌రిపోర్ట్) కేసును 326 నాన్‌బెయిల్‌బుల్‌గా మార్చినట్లు పోలీసులు తెలిపారు. అలానే ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచి దానబోయిన పాములు, దానబోయిన చలమయ్య, జాబుల పిచ్చయ్య పేర్లను అదనంగా ఈ కేసులో చేర్చారు. ఈ కేసులో 8 మంది నిందితులను ఆసుపత్రిలో వైద్యపరీక్షల అనంతరం బుధవారం కోర్టుకు హాజరుపరచగా.. రిమాండ్ విధించినట్లు సీఐ టి. నారాయణస్వామి తెలిపారు. ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావును అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

వరద బాధితులకు రూ.5 లక్షల సామగ్రి పంపిణీ


సామగ్రితో బయలుదేరుతున్న బస్సు వద్ద చైర్మన్ లావు రత్తయ్య తదితరులు

చేబ్రోలు: తాడేపల్లిలోని వరద బాధితులకు రూ.5 లక్షల విలువైన గృహ సామగ్రిని అందజేసినట్లు చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య సదరు వస్తువులతో బయలుదేరిన బస్సును జెండా ఊపి ప్రారంభించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ.. ఇటీవల వరద ప్రాంతాల్లో ముంపునకు గురైన 500 కుటుంబాలకు ఈ సామగ్రి పంపిణీ చేశామన్నారు. నులకపేట చైతన్య తపోవన్ శ్రేయో కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. ఆయా విభాగాల డీన్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త సచ్చిదానందమూర్తి పేరిట పోస్టల్ కవర్ విడుదల


పోస్టల్ కవర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు, వీసీ ఆచార్య కె.గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి పేరిట ప్రత్యేక పోస్టల్ కవర్‌ను బుధవారం విడుదల చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఆచార్య కొత్త సచ్చిదానందమూర్తి అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సచ్చిదానందమూర్తి సెంటర్ ఫర్ స్టడీస్ ఇన్ ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీస్ డైరెక్టర్ ఆచార్య త్రిమూర్తి రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆచార్య సచ్చిదానందమూర్తి శతజయంతి ఉత్సవాలు ఏఎన్‌యూలో నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో జన్మించిన గొప్ప తత్వవేత్త సచ్చిదానందమూర్తి అని కొనియాడారు . మానవ జీవన విధానాన్ని తన రచనలతో విపులంగా వివరించారన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు మాట్లాడుతూ.. కొత్త సచ్చిదానందమూర్తి తత్వశాస్త్రానికి కొత్త భాష్యం చెప్పారని పేర్కొన్నారు. భారతీయ తత్వశాస్త్రాన్ని విశ్వవ్యాప్తం చేశారన్నారు. చైనాలో సైతం సేవలు అందించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. విజయవాడ ప్రాంతీయ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఏస్‌వీఆర్ మూర్తి మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక పోస్టల్ కవర్లను విడుదల చేయడం గొప్ప విషయం అన్నారు. రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపల్స్ ఆచార్య సీహెచ్ స్వరూపారాణి, ఆచార్య కె. వీరయ్య, ఆచార్య పి.సిద్ధయ్య, ఆచార్య ఏ ప్రమీలారాణి కూడా ప్రసంగించారు. అధ్యాపక సంఘం, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



నగరంపాలెం: ఇంటెలిజెన్స్ గుంటూరు డీఎస్పీగా కొసన సుధాకర్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు శ్యామలానగర్‌లోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టాక జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు. సుధాకర్‌బాబు 1995లో ఎస్ఐగా చేరారు. 2010లో సీఐగా ఉద్యోగోన్నతి పొంది గుంటూరు రూరల్ ఎస్బీ, గుంటూరు అర్బన్ సీసీఎస్, మేడికొండూరు పీఎస్, ఇంటెలిజెన్స్, గుంటూరు రేంజ్ కార్యాలయంలో పనిచేశారు. ఇటీవల డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు.